
సాక్షి
పార్వతీపురం మన్యం
శుక్రవారం । 7 । ఏప్రిల్ । 2023



నగర అభివృద్ధే ధ్యేయం

నగర అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ప్రధాన కూడళ్లను అందంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. -8లో



హమాలీల సమస్యల పరిష్కారానికి చర్యలు : జేసీ

జిల్లాలో హమాలీల సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ తెలిపారు. -8లో



విధులను బహిష్కరించిన న్యాయవాదులు

ఢిల్లీలో సీనియర్ న్యాయవాది వీరేంద్ర నార్వల్ హత్యకు నిరసనగా జిల్లా న్యాయవాదుల సంఘం పిలుపు మేరకు గురువారం విధులను బహిష్కరించారు. -8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శుక్ర(సా)	శని(ఉ)
6:16	4:24

న్యూస్‌రీల్

విజయనగరం జిల్లా కలెక్టర్‌గా నాగలక్ష్మి

- విజయనగరం ఉమ్మడి జిల్లాలో పలువురు ఐఏఎస్‌ల బదిలీ
- పార్వతీపురం మన్యం జిల్లా జేసీగా ఎ.సిరి
- సీతంపేట ఐటీడీఏ పీఓగా కల్పనాకుమారి



ఎస్.నాగలక్ష్మి



అట్టాడ సిరి



కల్పనాకుమారి

సాక్షి ప్రతినిధి, విజయనగరం: విజయనగరం ఉమ్మడి జిల్లాలో పలువురు ఐఏఎస్ అధికారులకు బదిలీ అయ్యింది. గతంలో తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) సీఎండీగా, ప్రస్తుతం అనంతపురం కలెక్టర్‌గా పనిచేస్తున్న ఎస్.నాగలక్ష్మి విజయనగరం జిల్లా కలెక్టర్‌గా రానున్నారు. దాదాపు 19 నెలల పాటు విజయనగరం జిల్లా కలెక్టర్‌గా సేవలందించిన ఎ.సూర్యకుమారికి బదిలీ అయ్యింది. ఆమెను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్‌ను ప్రభుత్వం విశాఖపట్నం జాయింట్ కమిషనర్ (సీటీ)గా నియమించింది. ఆయన స్థానంలో 2015 బ్యాచ్ ఐఏఎస్ అధికారి ఎ.సిరి రానున్నారు. గతంలో ఆమె పాలకొండ ఆర్డీఓగా పనిచేశారు. ప్రస్తుతం సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా పనిచేస్తున్న బి.నవ్యకు బదిలీ అయ్యింది. ఉపాధి, శిక్షణా డైరెక్టర్‌గా ఆమెకు పోస్టింగ్ వచ్చింది. ఆమె స్థానంలో 2018 బ్యాచ్ ఐఏఎస్ అధికారి కల్పనాకుమారి నియమితులయ్యారు. ప్రస్తుతం ఆమె అనకాపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్ పనిచేస్తున్నారు.

జంఝావతి ప్రాజెక్టు సందర్శన



జంఝావతి ప్రాజెక్టును పరిశీలిస్తున్న సీపీఐ బృందం

కొమరాడ: జంఝావతి ప్రాజెక్టును సీపీఐ బృందం గురువారం సందర్శించింది. ఒడిశా ప్రభుత్వంతో చర్చించి పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీరు అందేలా ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య అధికారులను కోరారు. 2004లో దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి ప్రాజెక్టుపై రబ్బర్‌డ్యామ్ నిర్మించి 12వేల ఎకరాలకు సాగునీరు అందేలా చేశారన్నారు. ఆయన తర్వాత పాలించిన ముఖ్యమంత్రులు ప్రాజెక్టును పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పి.కామేశ్వరరావు, కూరంగి మన్మధరావు, సహాయ కార్యవర్గ సభ్యుడు గరుగుబిల్లి సూరయ్య పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత

- గ్రామీణ నీటి సరఫరా శాఖ డీఈ నాగేశ్వరరావు



మాట్లాడుతున్న డీఈ నాగేశ్వరరావు

కొమరాడ: ప్రతి ఇంటా ఇంకుడు గుంత నిర్మాణాన్ని ప్రోత్సహించి భూగర్భజలాలు పెంపుదలకు తోడ్పడాలని ఇంజినీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్లకు గ్రామీణ తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య డీఈ నాగేశ్వరరావు సూచించారు. కొమరాడ మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాడు–నేడు, సీఆర్ యాప్, ఇంకుడు గుంతల నిర్మాణం, జేజేఎమ్ పనుల పురోగతిపై చర్చించారు. గ్రామాల్లో తాగునీటి కొరత ఏర్పడకుండా చూడాలని ఆదేశించారు. పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎల్.వి. అప్పారావు, మండల విద్యాశాఖ అధికారి జామి నారాయణస్వామి, జేఈ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేతనదారుల్లో వేతన ఉత్సాహం



పార్వతీపురం మండలంలో ఉపాధిహామీ పనులు చేస్తున్న వేతనదారులు (ఫైల్)

- ఉపాధిహామీ వేతనదారుల రోజువారీ వేతనం పెంపు
- రూ.257నుంచి రూ.272కు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం
- వేతనదారులకు రూ.5కోట్ల లబ్ధి
- జిల్లాలో 2.05 లక్షల జాబ్‌కార్డులు
- 3.92 లక్షలమంది వేతనదారులు
- వేతనం రూపంలో చెల్లిస్తున్న మొత్తం రూ.21.67 కోట్లు
- మెటీరియల్‌గా అందించిన మొత్తం రూ.10.70 కోట్లు

పార్వతీపురం టౌన్:

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వేతనదారుల రోజువారీ వేతనం పెంచుతూ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీని ప్రకారం ఇంతవరకూ వేతనదారులకు ప్రతి రోజు చెల్లించే రూ.257 వేతనం రూ.272కు పెరిగింది. వేతనం పెంపుతో వేతనదారులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 2.05 లక్షల కుటుంబాలకు జాబ్‌కార్డులు ఉన్నాయి. 3.92 లక్షల మంది వేతనదారులు ఉన్నారు. వీరికి జిల్లా నీటి యాజమాన్య సంస్థ పనులు కల్పిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 1.44 కోట్ల పనిదినాలు కల్పించి, వేతనాల రూపంలో రూ.180.01 కోట్లు చెల్లించింది. తాజాగా ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి వేతనం రూ.15లు ప్రభుత్వం పెంచడంతో 3.92 లక్షల మంది ఉపాధి వేతనదారులకు అదనంగా రూ.5 కోట్ల ప్రయోజనం కలుగనుందని అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో వేతనదారుల సంఖ్య ఇలా...

మండలం	వేతనదారుల సంఖ్య	కురుపాం	23,470
బలిజిపేట	29,379	మక్కువ	25,593
భామిని	21,281	పాచిపెంట	23,904
గరుగుబిల్లి	22,780	పాలకొండ	19,871
గుమ్మలక్ష్మీపురం	23,849	పార్వతీపురం	32,138
జియ్యమ్మవలస	32,855	సాలూరు	27,216
కొమరాడ	24,348	సీతంపేట	31,699

వేతనం పెంపుతో ప్రయోజనం



ఏప్రిల్ 1 నుంచి ఉపాధి హామీ వేతనదారులకు ఇచ్చే దినసరి వేతనం పెంపుతో ప్రయోజనం కలుగనుంది. ఇప్పటికే గ్రామ సభలు నిర్వహించి ఏడాది పొడవునా చేయాల్సిన పనులను గుర్తించాం. ఆ మేరకు ప్రాధాన్యతా క్రమంలో వేతనదారులకు పనులు కల్పిస్తున్నాం. వేసవి కాలంలో పని ప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. నాలుగేళ్లుగా వంద శాతం పని దినాలు పూర్తిచేస్తున్నాం.

– రామచంద్రరావు, డ్వామా పీడీ, పార్వతీపురం మన్యం

పీజీ కోర్సుల ప్రవేశాల షెడ్యూల్ విడుదల

- ఎన్‌టీఏ నిర్వహణలో ప్రవేశ పరీక్ష
- ఈ నెల 19వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- సెంట్రల్ ట్రైబల్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కట్టిమణి



సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ అడ్మిన్ కార్యాలయం

విజయనగరం అర్బన్: సెంట్రల్ ట్రైబల్ వర్సిటీ(ఏపీ)లో 2023–24 విద్యా సంవత్సరానికి వివిధ పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) కోర్సుల్లో ప్రవేశాలకు వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ, మాస్టర్ ఆఫ్ సోషల్‌వర్క్, మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, మాస్టర్ ఆఫ్ ట్రైబల్ స్టడీస్, మాస్టర్ ఆఫ్ ఇంగ్లిష్, మాస్టర్ ఆఫ్ సోషియాలజీ, మాస్టర్ ఆఫ్ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్స్ వంటి కోర్సుల్లో ప్రవేశాలుంటాయన్నారు. వీటి కోసం అర్హత పరీక్ష (సీయూఈటీ)ను జాతీయ స్థాయిలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహిస్తుందన్నారు. అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు ఎన్‌టీఏ వెబ్‌సైట్‌లో ఈ నెల 19వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రతి కోర్సులో 20 సీట్లు ఉంటాయని, జాతీయ రిజర్వేషన్ పాలసీకి లోబడి సీట్ల భర్తీ ప్రక్రియ జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని తెలుగు రాష్ట్రాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఎన్‌టీఏ వెబ్‌సైట్‌లో సీయూఈటీ (పీజీ) బ్రోచర్‌లో పేర్కొన్న సూచనల మేరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో జారాకు కాంస్యం

విజయనగరం: కేరళ రాష్ట్రంలోని కోడికూడలో జరిగిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విజయనగరం జిల్లాకు చెందిన ఎస్.జారా సత్తా చూపింది. సీనియర్స్ కేటగిరీ 69 కేజీల విభాగంలో బెంచ్ ప్రెస్‌లో 77.5 కేజీల బరువు ఎత్తి కాంస్య పతకం సాధించింది. ఆమెను జిల్లా క్రీడాభిమానులు, క్రీడాకారులు అభినందించారు.



పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కాంస్య పతకం అందుకుంటున్న జారా

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

విజయనగరం రూరల్: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనలో భాగంగా ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 90 రోజుల పాటు ఉచిత శిక్షణ కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి నీలం గోవిందరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2019 నుంచి 2022 మధ్య పదో తరగతి ఉత్తీర్ణులై, 18 నుంచి 28 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న నిరుద్యోగ యువకులకు రిఫ్రిజిరేటర్, ఎయిర్ కండీషనింగ్, వాషింగ్ మిషన్‌ల నిర్వహణపై ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. మల్టీనేషనల్ కంపెనీ డైకిన్‌లో ఉద్యోగఅవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. కొండకరకాం గ్రామం వద్ద ఉన్న గిరిజన భవన్‌లోని గిరిజన నైపుణ్య కేంద్రంలో శిక్షణ తరగతులు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగులు వారి వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్: 90520 57825, 809961303 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పేద ప్రజలకు ఆరోగ్య భరోసా

- రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ
- ద్వారపూడిలో ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రారంభించిన మంత్రి



ఫ్యామిలీడాక్టర్ కార్యక్రమం ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ, పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం రూరల్:

రాష్ట్రంలో పేద ప్రజల ఆరోగ్యానికి జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ స్పష్టంచేశారు. విజయనగరం మండలం ద్వారపూడి గ్రామంలో గురువారం 'ఫ్యామిలీ డాక్టర్' సేవలను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటి వద్దకే వైద్య సేవలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ విధానానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజల బాగోగులను పట్టించుకునే ప్రభుత్వమే పదికాలాలు పాటు నిలిచి ఉంటుందని, ప్రజల పక్షాన నిలిచిన వారికే వారు పట్టం కడతారని పేర్కొన్నారు. జిల్లాలోని 66 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ (పీహెచ్‌సీలు) ఇద్దరేసి వైద్యులను నియమించామని, ఒక వైద్యుడు పీహెచ్‌సీలో ఉంటే మరో వైద్యుడు 104 వాహనాల్లో గ్రామాలకు వెళ్లి వైద్యం అందిస్తారని చెప్పారు. గొప్ప సదుద్దేశంతో చేపట్టిన ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకంతో పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అమలు చేస్తే, ఆయన తనయుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి అడుగుజాడల్లో మరో బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టి తండ్రికి తగ్గ తనయుడిగా పాలన సాగిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు నేరుగా ప్రజలకు అందిస్తున్నారన్నారు. నాడు–నేడు కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారి కార్పోరేట్ స్థాయికి మారాయన్నారు. అవినీతికి తావులేకుండా లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులనే నేరుగా సంక్షేమ పథకాల అమలుపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ముఖ్యమంత్రి ధ్యేయమని తెలిపారు.

ఆరోగ్య భరోసా

ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చారని శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఇప్పటికే ఇంటింటికీ పింఛన్లతో పాటు రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శనీయం



ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

- ఫ్యామిలీ డాక్టర్ విధానం దేశానికే ఆదర్శం
- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

పాచిపెంట: పేద ప్రజలకు వైద్యభరోసా కల్పిస్తూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆచరణలోకి తెచ్చిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం దేశానికే ఆదర్శనీయమని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని మోసూరు గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని కలెక్టర్ నిషాంత్‌కుమార్‌తో కలిసి డిప్యూటీ సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ సామన్యుడి చెంతకు వైద్యసేవలు అందించి ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడమే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. పేదవాడి ప్రాణం కాపాడడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. గిరిజనులు దూర ప్రాంతాలకు వెళ్లి వైద్యం పొందలేని పరిస్థితుల్లో ఫ్యామిలీ డాక్టర్ విధానం అత్యంత ఉపయోగకరమని పేర్కొన్నారు. ఫ్యామిలీ డాక్టర్ సేవల్లో 14 రకాల వైద్యపరీక్షలు నిర్వహిస్తారని, 105 రకాల మందులు ఉచితంగా అందజేస్తారని చెప్పారు. పేదప్రజలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలో పార్వతీపురం, సీతంపేటలో మల్టీస్పెషాలిటీ ఆస్పత్రులు నిర్మితమవుతున్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి జి.జగన్నాథరావు, ప్రోగ్రాం అధికారి వినోద్, సర్పంచ్ గండిపల్లి చంటి, పార్టీ మండలాధ్యక్షుడు గొట్టాపు ముత్యాలనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శులు పాచిపెంట వీరంనాయుడు, డోలబాబ్జి, కలుపలపల్లి పెద్దిబాబు, మాజీ వైస్ ఎంపీపీ తట్టికాయల గౌరీశ్వరావు, గండి పల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వైద్యసేవలు



రాజ్యలక్ష్మీపురంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి జగన్మోహనరావు

కొమరాడ: ఫ్యామిలీ డాక్టర్ విధానంలో గ్రామాల్లోని విలేజ్‌హెల్త్ క్లినిక్‌లు, సచివాలయాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తామని, మంచంపై లేవలేని రోగుల ఇంటికి వెళ్లి వైద్యసేవలు అందిస్తామని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు తెలిపారు. మండలంలోని రాజ్యలక్ష్మీపురంలో ఫ్యామిలీ డాక్టర్ శిబిరాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా మనరాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. దీర్ఘకాలిక రోగులు, గర్భిణులు, బాలింతలు ఫ్యామిలీ డాక్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన అవసరం ఉండదన్నారు. ప్రజలకు డబ్బు, సమయం ఆదా అవుతుందని, నిపుణులైన వైద్యులు ఊరూరా తిరిగి వైద్యసేవలు అందిస్తారని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు, వైద్యులు అరుణ్‌కుమార్, సర్పంచ్, అంగన్‌వాడీ సిబ్బంది బి.అలివేలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్'ను విజయవంతం చేయండి

పాచిపెంట:

జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర కోరారు. మండలంలోని మోసూరు గ్రామంలో గురువారం జగనన్నే మాభవిష్యత్ కార్యక్రమంపై కార్యకర్తలు, నాయకులకు దిశానిర్దేశం చేశారు. గృహసారథుల సారథ్యంలో రోజుకు ఐదు గ్రామాల చొప్పున పర్యటించి సుమారు 10 నిమిషాలపాటు ప్రజల సమస్యలు, ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమపాలనపై అభిప్రాయాలు సేకరించాలన్నారు. సంక్షేమ పథకాల లబ్ధిని వివరించాలని సూచించారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు.



జగనన్నే మా భవిష్యత్ వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

క్లుప్తంగా

చెట్టును ఢీకొట్టిన వ్యాన్

- డ్రైవర్, క్లీనర్‌కు తీవ్ర గాయాలు



ప్రమాదంలో నుజ్జయిన వ్యాను ముందు భాగం

కురుపాం: మండలంలోని గుమ్మ గ్రామ సమీపంలో పార్వతీపురం నుంచి గుమ్మలక్ష్మీపురం వైపు వెళ్తున్న కోళ్ల వ్యాన్ చెట్టును గురువారం బలంగా ఢీకొట్టింది. దీంతో వ్యాన్ ముందు భాగం నుజ్జయింది. డ్రైవర్, క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కి సమాచారం ఇవ్వగా క్షతగాత్రులను కురుపాం ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సీహెచ్ ప్రసాద్ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: ఎన్‌హెచ్ఎంకు సంబంధించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వారి పరిధిలో ఉన్న ఎస్ఎన్‌సీయూలో సెక్యూరిటీ గార్డు ఒకపోస్టు (రోస్టర్ ఎస్టీ, మగ), డెంటల్ టెక్నీషియన్ 2 పోస్టులు, ఐడీఎస్‌పీ పథకంలో ఎపిడిమాలజిస్టు పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు విజయనగరం. ఏపీ.జిఒవి.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. సెక్యూరిటీ గార్డు పోస్టుకు 11వతేదీలోగా, డెంటల్ టెక్నీషియన్, ఎపిడిమాలజిస్టు పోస్టులకు 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి రైల్వే గేట్ సమీపంలో గురువారం ఉదయం గూడ్స్ రైలు ఢబుకొని పాచలవలస గ్రామానికి చెందిన మరడానం రమేష్(45) మృతి చెందినట్లు బొబ్బిలి రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఈశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. మృతుడు రెండు రోజులు క్రితం కూలి పనికి వెళ్తానని ఇంటి వద్ద చెప్పి తిరుగు ప్రయాణంలో వస్తుండడంతో ఢీకొని మృతి చెందినట్లు తెలిపారు. కోమటిపల్లి రైల్వే మాస్టర్ సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకొని శవపంచనామా అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహన్ని అప్పగించినట్లు తెలిపారు.

బస్సు ఢీకొని వృద్ధురాలి మృతి



సంఘటనా స్థలంలో సీతమ్మ మృతదేహం

బొబ్బిలి: మండలంలోని కమ్మవలస వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొని కండి సీతమ్మ(70)అనే వృద్ధురాలు గురువారం మృతి చెందింది. ఎస్‌ఐ చదలవాడ సత్యనారాయణ తెలిపిన వివరాలు.. సీతమ్మ తన దగ్గరి బంధువును పరామర్శించేందుకు బొబ్బిలి వచ్చింది. తిరిగి కమ్మవలస వెళ్లేందుకు నారాయణపురం బస్సు ఎక్కింది. గ్రామం వద్ద బస్సు దిగిన వృద్ధురాలు సీతమ్మ బస్సు ముందు భాగం నుంచి వంగి నడుచుకుంటూ వెళ్లడాన్ని డ్రైవర్ గమనించకుండా బస్సును తోలడంతో ఆమె చక్రాల కింద పడి తీవ్ర గాయాల పాలైంది. ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతి చెందిన సీతమ్మకు భర్త ఇప్పటికే మృతి చెందగా ముగ్గురు సంతానం ఉన్నారు. ఎస్‌ఐ సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నగర అభివృద్ధే ధ్యేయం

- సుందరంగా ప్రధాన కూడళ్లు
- మహనీయుల స్ఫూర్తిని స్మరించుకోవటానికే దండి మార్చ్ విగ్రహాలు
- రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ



విగ్రహాలను ఆవిష్కరిస్తున్న విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పక్కన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: నగర అభివృద్ధే ధ్యేయంగా వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టడం అభినందనీయమని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్‌లో కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ.30 లక్షలతో కొత్తగా ఏర్పాటు చేసిన దండి సత్యాగ్రహ విగ్రహాలను మంత్రి బొత్స సత్యనారాయణతో పాటు ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, కలెక్టర్ ఎ.సూర్యకుమారి, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మిలతో కలిసి గురువారం ఆవిష్కరించారు. జంక్షన్‌లో ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటైన్‌ను స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స మాట్లాడుతూ అభివృద్ధితో పాటు, ప్రజల్లో స్వాతంత్ర్య స్ఫూర్తిని నింపేందుకు ఈ విగ్రహాలు దోహదం చేస్తాయని అన్నారు. తమ ప్రభుత్వం విజయనగరం నగరాన్ని దశల వారీగా అభివృద్ధి చేయడానికి, సుందరీకరణకు కట్టుబడి ఉందన్నారు. దీనిలో భాగంగా నేటి నుంచి వరుసగా వారం రోజుల పాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు నిర్వహించటం జరుగుతుందన్నారు. ప్రజలు కూడా అభివృద్ధికి సహకరించాలని, మంచి పనులు చేపడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్లతో పాటు కార్పొరేషన్ పాలకవర్గానికి అభినందనలు తెలిపారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ ప్రజల్లో నాటి స్వాతంత్ర్య స్ఫూర్తిని నింపేందుకు దండి సత్యాగ్రహ విగ్రహాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. స్వాతంత్ర్య సమరానికి స్ఫూర్తిగా నిలిచిన ఉప్పు సత్యాగ్రహం 1930 మార్చి 12న సబర్మతి ఆశ్రమం వద్ద ప్రారంభమైందని, నాటి బ్రిటీష్ ప్రభుత్వం ఉప్పుపై వేసిన పన్నును ధిక్కరిస్తూ ఏప్రిల్ 6న దండి వద్ద ఉప్పును తయారు చేశారని చెప్పారు. వేల మంది సత్యాగ్రహంతో గాంధీ మహాత్ముడు కలిసి చేసిన ఈ శాసనోల్లంఘన, స్వాతంత్ర్య ఉద్యమానికి స్ఫూర్తిగా నిలిచిందని పేర్కొన్నారు. అటువంటి గొప్ప వ్యక్తులను నిత్యం స్మరించుకునేలా, భావితరాలకు వారి గొప్పతనాన్ని తెలియజేసేలా విగ్రహాలు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్‌లు కోలగట్ల శ్రావణి, ఇసరపు రేవతీదేవి, కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, కార్పొరేషన్ ఈఈ కె.శ్రీనివాసరావు, వివిధ డివిజన్‌ల కార్పొరేటర్లు, ప్రజలు పాల్గొన్నారు.



దండి సత్యాగ్రహంలో పాల్గొన్న సమరయోధుల విగ్రహాలు

విధులను బహిష్కరించిన న్యాయవాదులు



నిరసనలో పాల్గొన్న న్యాయవాదులు

విజయనగరం లీగల్: ఢిల్లీలో సీనియర్ న్యాయవాది వీరేంద్ర నార్వల్ హత్యకు నిరసనగా స్థానిక న్యాయవాదుల సంఘం పిలుపు మేరకు విధులను గురువారం బహిష్కరించారు. న్యాయవాదులు నల్ల రిబ్బన్‌లు ధరించి జిల్లా కోర్టు ఆవరణలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు సి.హెచ్.దామోదర రామమోహన్‌రావు మాట్లాడుతూ ఢిల్లీ న్యాయవాది వీరేంద్ర నర్వాల్ హత్య దారుణమన్నారు. కిరాతక చర్యగా అభివర్ణించారు. దోషులకు వెంటనే శిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల రక్షణ చట్టం తక్షణమే రూపొందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు అంజనీకుమార్, వి.జి.సంతోష్, కొనచినఅప్పారావు, పీటర్ మార్టిన్, ఆర్.రాజరాజేశ్వరి, ఎస్.హరిమోహన్, గునాన రాంబాబు, ఎస్.సుబ్రమణ్యం, భవానీ తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థి దుర్మరణం

- బైక్ బోల్తాపడి తీవ్ర గాయాలు
- ఎస్‌ఐ వాహనంలో ఆస్పత్రికి తరలింపు
- అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించిన వైద్యులు



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శేఖర్



సాంబారిక శేఖర్(ఫైల్)

తెర్లాం: రోడ్డు ప్రమాదంలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి మృతి చెందిన సంఘటన మండలంలోని ఎం.ఆర్.అగ్రహారం వద్ద జరిగింది. దీనికి సంబంధించి తెర్లాం ఎస్‌ఐ ఆర్.రమేష్ గురువారం తెలిపిన వివరాలు... మెరకముడిదాం మండలం సోమలింగాపురం గ్రామానికి చెందిన సాంబారిక శేఖర్(18) బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బుధవారం రాత్రి శేఖర్ సోమలింగాపురం బైక్‌పై వెళ్లి వస్తుండగా ఎం.ఆర్.అగ్రహారం సమీపంలోని జ్యూట్ ఫ్యాక్టరీ వద్ద మోటార్ సైకిల్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో శేఖర్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. రోడ్డు ప్రమాద విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రమేష్ సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితి సమీక్షించారు. తీవ్రంగా గాయపడి సంఘటనా స్థలంలో పడి ఉన్న యువకున్ని తన వాహనంలో ఎక్కించుకొని తెర్లాంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువచ్చి డాక్టర్‌కు చూపించారు. అప్పటికే శేఖర్ మృతి చెందాడని డాక్టర్ వెల్లడించారు. కుటుంబ సభ్యుల సమక్షంలో శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి మృతదేహాన్ని తరలించారు. శేఖర్ తండ్రి అప్పారావు తెర్లాంలో పైలట్ మంచినీటి పథకం పంపు ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. కొంత కాలంగా తెర్లాంలోని పంచముఖేశ్వర కాలనీలో భార్య పిల్లలతో నివాసముంటున్నాడు. ఉన్నత చదువులు చదివి తమను ఆదుకుంటాడని ఆశిస్తే.. దేవుడు ఇలా చేశాడని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు.

మానవత్వం చాటుకున్న ఎస్‌ఐ

ప్రమాద విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రమేష్ సంఘటనా స్థలానికి చేరుకొని తన వాహనంలోనే తెర్లాంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి తన మానవత్వాన్ని చాటుకున్నాడు. అయితే అప్పటికే శేఖర్ మృతి చెందడంతో చేసేదేమి లేకుండా పోయింది.

హమాలీల సమస్యల పరిష్కారానికి చర్యలు : జేసీ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఆనంద్

పార్వతీపురం: జిల్లాలో హమాలీల సమస్యలు త్వరగా పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా పౌర సరఫరాల శాఖ నేతృత్వంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో హమాలీల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. హమాలీల హక్కులను కాపాడేందుకు సహకరిస్తామని, అదే సమయంలో బాధ్యతగా పనులు నిర్వహించాల్సిన అవసరం ఉందని సూచించారు. జిల్లాలో పరిష్కారం కాని అంశాలు ఉంటే రాష్ట్ర స్థాయి అధికార్ల దృష్టికి తీసుకొని వెళ్లడం జరుగుతుందని తెలిపారు. ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద మూమెంట్ ఇన్‌టైంలో కంప్లీట్ చేసి సకాలంలో ఎఫ్‌పీ షాప్‌ల ద్వారా ఎండీయూలకు సప్లై చేయాలని అన్నారు. గొడౌన్‌లు శుభ్రంగా వుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానికంగా ఉండే సమస్యలను వారం రోజులలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ ఎం.డి.నాయక్, జిల్లా పౌర సరఫరాల అధికారి కేఏల్ఎస్ మూర్తి, హమాలీలు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ జీవీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్



డాక్టర్ పద్మజ

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగాధిపతి అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎ.పద్మజకు జేఎన్‌టీయూ కాకినాడ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. 'ఆటోమేటిక్ జనరేషన్ కంట్రోల్ ఆఫ్ మల్టీ ఏరియా హైబ్రిడ్ పవర్ సిస్టమ్స్' అనే అంశంపై ఆమె చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ ప్రదానం చేశారు. పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తిని పెంచేందుకు పునరుత్పాదక శక్తిని గ్రిడ్‌కు అనుసంధానం చేయాల్సిన అవసరాన్ని గుర్తించి ఈ పరిశోధన చేసినట్లు ఆమె తెలిపారు. మెషిన్ లెర్నింగ్ టెక్నిక్ అయిన సపోర్ట్ వెక్టార్ కంట్రోలర్‌ని ఉపయోగించి సౌర మరియు వాయుశక్తి గ్రిడ్‌కు అనుసంధానం చేయడం వల్ల ఫ్రీక్వెన్సీ మరియు టై లైన్లో పవర్లో వచ్చే మార్పులను ఆటోమెటిక్‌గా కంట్రోల్ చేయటమే ఈ పరిశోధన ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. పీహెచ్‌డీ పొందిన డాక్టర్ పద్మజను జేఎన్‌టీయూ జీవీ వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.స్వామినాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.గురునాథ, వివిధ విభాగాల అధిపతులు అభినందనలు తెలిపారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కె. 10గ్రా.)	56,150–00
బంగారం(22కె. 10గ్రా.)	51,800–00
వెండి (కిలో)	71,200–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹95	₹160	₹ 170

సైనికుడి మృతి తీరని లోటు

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన

చీపురుపల్లి: విధి నిర్వహణలో శిక్షణ పొందుతూ మృతి చెందిన ఇండియన్ నేవీ సైనికుడు(పీటీ ఆఫీసర్) చందక గోవింద్ మృతికి జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ సంతాపం తెలిపారు. కోల్‌కత్తాలో జరుగుతున్న పారా గ్లైడింగ్ శిక్షణలో పారాచూట్ తెరుచుకోకపోవడంతో గోవింద్ మృతి చెందడం తీరని లోటని పేర్కొన్నారు. చీపురుపల్లి మండలంలోని పర్ల గ్రామానికి చెందిన చందక గోవింద్ ఇండియన్ నేవీలో ఉద్యోగం చేస్తూ పారా గ్లైడింగ్‌లో శిక్షణ పొందుతూ మృతి చెందడం స్థానికంగా అందరినీ కలచివేసిందని తెలిపారు. దేశం రక్షణ కోసం శిక్షణ పొందుతూ ప్రాణాలు విడిచిన గోవింద్ మృతి కుటుంబంతో పాటు సమాజానికి తీరని లోటని తెలిపారు. అయితే పారాచూట్ తెరుచుకోకపోవడంపై సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తెలిపారు. త్వరితగతిన మృతదేహాన్ని స్వగ్రామానికి పంపాలని కోరినట్లు వివరించారు.

రీ సర్వే పనుల పూర్తికి చర్యలు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: రీ సర్వే పనులు సకాలంలో పూర్తి చేసేందుకు కావల్సిన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కేఎస్ జవహర్‌రెడ్డి కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వేను సకాలంలో పూర్తి చేయడానికి కావల్సిన అన్ని ఏర్పాట్లు చేశామని, పనులు పురోగతిపై ప్రతీ రోజు సమీక్షిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జేసీ ఓ.ఆనంద్, పీఓ సి.విష్ణుచరణ్, డీఆర్ఓ జె.వెంకట్రావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శంకరరావు

పార్వతీపురం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా నిప్పులు రాలి గాయాలైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు.. మక్కువ మండలం చిముగు గ్రామానికి చెందిన కె.శంకరరావు విద్యుత్ కనెక్షన్ ఇస్తున్న సమయంలో షార్ట్ సర్క్యూట్ జరగడంతో విద్యుత్ తీగల నుంచి నిప్పులు రాలడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు స్థానికులు ప్రథమ చికిత్సకోసం మక్కువ పీహెచ్‌సీకి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

10న బీఈడీ మిగులు సీట్ల భర్తీ

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో బీఈడీ, బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో మిగులు సీట్ల భర్తీకి ఈనెల 10న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ఏయూ ప్రవేశాల సంచాలకులు ఆచార్య డి.ఎ.నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏయూ ఆర్ట్స్ కళాశాల, ఐఏఎస్ఈలో కొన్ని సీట్లు మిగిలాయని, వీటిని ఎడ్‌సెట్ 2022లో అర్హత సాధించిన వారితో స్పాట్ అడ్మిషన్ల విధానంలో భర్తీ చేస్తామని చెప్పారు. ఖాళీల వివరాలు డీడీఈ ఆ ఏ.జీ ఓ వెబ్‌సైట్‌లో పొందుపరిచారన్నారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు తమ విద్యార్హత తెలిపే సరిఫికెట్లు, ఎడ్‌సెట్ ర్యాంక్ కార్డులతో నేరుగా హాజరుకావాలని సూచించారు.

రెండు బైక్‌లు ఢీ : ఇద్దరికి గాయాలు

రాజాం సిటీ: మండల పరిధి కంచరాం గ్రామం జంక్షన్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు వ్యక్తులు గాయాల పాలయ్యారు. రాజాంకు చెందిన శ్రీనివాసరావు, మానాపురానికి చెందిన ఈశ్వరరావు ద్విచక్ర వాహనాలపై ఎదురెదురుగా ఢీకొనడంతో గాయపడ్డారని స్థానికులు తెలిపారు. వీరిని 108 వాహనంలో రాజాంలోని కేర్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఇద్దరు మత్స్యకారులపై కేసు నమోదు

వంగర: మండల పరిధి మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టులో అక్రమంగా చేపలు వేట సాగిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బుడుమూరు లోకేశ్వరరావు గురువారం తెలిపారు. లీజు సొమ్ము ప్రభుత్వానికి చెల్లించకపోవడంతో ప్రాజెక్టులో చేపలు వేటను నిషేధిస్తూ మత్స్యశాఖ అధికారులు గతంలో ఉత్తర్వులు జారీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించి ప్రాజెక్టులో చేపలు వేట సాగిస్తున్న మండల పరిధి పటువర్ధనం గ్రామానికి చెందిన మత్స్యకారులు మురగడాపు పోలిపల్లి, మురగడాపు దుర్గారావులపై మడ్డివలస, సంగాం సచివాలయాల ఫిషరీస్ అసిస్టెంట్‌లు రఘురాం, చైతన్యలు వంగర పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువతిని మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

సాలూరు: ప్రేమ పేరుతో యువతిని శారీరకంగా లొంగదీసుకుని, పెళ్లికి నిరాకరించిన యువకుడుపై కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ ధనుంజయరావు తెలిపారు. గురువారం రూరల్‌స్టేషన్‌లో ఎస్‌ఐ ప్రయోగమూర్తితో కలిసి స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడారు. మండలంలోని చంద్రపువలస గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని, అదే గ్రామానికి చెందిన ఇళ్ల పైడిరాజు నమ్మించాడు. ఆమెను శారీరకంగా లొంగదీసుకున్నాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు. కాగా పెళ్లికి సదరు యువకుడు నిరాకరించడంపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. ముద్దాయిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు.



ముద్దాయిని చూపిస్తున్న సీఐ ధనుంజయరావు

బిడ్డను కన్న నెల రోజులకే గెంటేశారు...



పద్మజ - సుదర్శనం పెళ్లినాటి ఫొటో

తిరువళ్లూరు: ప్రసవించిన నెల రోజులకే అత్తింటి వారు బిడ్డను బలవంతంగా లాక్కుని ఇంటి నుంచి గెంటేశారని ఆంధ్రకు చెందిన ఓ వివాహిత తమిళనాడు రాష్ట్రంలోని తిరువళ్లూరు మహిళా పోలీసు స్టేషన్ వద్ద గురువారం ఆందోళనకు దిగడం కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం పెద్దకోమటిపేట ప్రాంతానికి చెందిన నాగులు బుజ్జిరామారావు కుమార్తె పద్మజ(38). సాలూరులో డిగ్రీని పూర్తి చేసి ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. మొదట భర్త నుంచి విడిపోయిన పద్మజ రెండవ వివాహం కోసం మ్యాట్రీమోనీలో తన వివరాలను నమోదు చేసుకున్నారు. పద్మజ వివరాలు తెలుసుకున్న తిరువళ్లూరుకు చెందిన ఇంజినీరింగ్ పట్టభద్రుడైన సుదర్శనం.. పద్మజ తల్లిదండ్రులను సంప్రదించినట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో 2021 జనవరి 25న తిరువళ్లూరులోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో వీరి వివాహం జరిగింది. వీరికి గత ఏడాది ఏప్రిల్‌లో ఓ బాబు జన్మించాడు. అయితే పద్మజ ప్రసవించిన నెల రోజులకే బాబుని లాక్కుని పుట్టింటికి తరిమేశారు. బిడ్డ కోసం తిరువళ్లూరు మహిళా పోలీసులను ఆశ్రయించిన పద్మజ పలుమార్లు ఫిర్యాదు చేసింది. అయితే పోలీసులు పట్టించుకోకపోవడంతో మహిళ పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళనకు దిగింది. తన కుమారుడిని చూడడానికి కూడా అత్తారింటి వారు అనుమతించడం లేదని, ప్రశ్నిస్తే దాడులకు యత్నిస్తున్నారని విలపించింది. తమిళనాడు పోలీసులు న్యాయం చేయడం లేదని వాపోయింది.